# కథావశిష్టుడు



తెల్లవారుఝాము నాలుగుగంటలవేళ... అతి ప్రశాంతంగా వుండే ఆ సమయంలో ఒక యువతి తన జీవిత కథనం ముగించుకొని కన్ను మూసింది. ఆ మసకమసక చీకట్లలో కిటికీలోంచి చూస్తుంటే వుండివుండి కొంచెం మెరుస్తూంది ఒక నక్షత్రం. చీకటులు మెల్లి మెల్లిగా నలుమూలలా పరుగులు పెడుతున్నాయి, పక్షులు బద్ధకంగాలేచి తెలివి తెచ్చుకొనేందుకు కాబోలు అరుస్తున్నాయి. ప్రశాంతంగా రాత్రి నిద్రపోతూవుండే మానవులూ కొంచం కొంచం మెలుకువలో పడుతున్నారు... ఆ కిటికీలోంచి చూస్తుంటే కృష్ణమూర్తికి అనేక వూహాలు కలిగి బాధగానిట్టూర్చాడు.

కథానిక

యింత ప్రశాంత సమయంలో ఆమె తన కథనం ముగించి... శాశ్వతంగా అతన్ని వదలి పోయింది. అవును... ఆమె కథనం ముగిసింది... నిజంగా, ఏ జీవికేనా కథనం ముగియడమంటూ వుంటుందా? ఇలాంటి తెల్లవారుఝాము లెన్ని వెళ్ళాయో! ప్రశాంత సమయంలో ఇతరుల జీవితాల్లో తుఫానులు రేపి, ఆ తుఫాను ఆగకుండానే సాగిపోయిన ప్రాణులూ చాలామంది వుంటారు. జీవితానికి నాంది ఎప్పుడైతే జరిగిందో అప్పుడే అందరికీ తెలుసు- ఎక్కడో ఎప్పుడో భరత వాక్యం పలక్క తప్పదని... ప్రశాంతమైన తన జీవిత సరస్సులో రాయివేసి అలల వలయాలు రేపింది కనకం. ఆ అలలు రేపిన కలలు ముగియకుండానే, తిరిగి రాయివిసిరితే? ఏ మానవమాత్రుడేనా ఎలా భరిస్తాడు? అసలు ఎందుకు చేయాలి అలాగ? తనేం ద్రోహం చేశాడామెకి?... జరిగిందేదో జరిగిపోయింది-ఆమెని సౌఖ్యంగాబతకనీ అని తను నిశ్చయానికివచ్చి జీవితంలో స్థిమితపడే సమయంలో... మళ్ళీ ప్రవేశించింది —— మళ్ళీ వెళ్ళిపొమ్మంది. ఇదంతా ఎందుకు?... తనకే బాధ్యతలూ లేనట్టూ ఈ ప్రపంచంలో తనుకోరే దేమీ లేనట్టూ కనకం కన్ను మూసింది... కాని తను! ఎలాగ యీజీవితంలో పోయిన మనశ్శాంతి పొందడం? ఆ కిటికీలోంచి అప్పుడప్పుడు, మెరిసిన నక్షత్రం కూడా కనిపించడంలేదు. వెలుగు వెల్లువ నలుమూలలనుంచీ యీ ప్రపంచాన్ని ఆక్రమించుకొంటోంది... కృష్ణమూర్తి ఆ కిటికీ వూచల కానుకొని అలా చూస్తూనేవున్నాడు. నిజంగానే ఆమె కథనం ముగిసింది మరి తనది?... అసలీ ప్రపంచంలో ముగింపన్నది దేనికైనా ఉందా?

ఎన్నో సంవత్సరాల స్నేహాన్ని కనకం ఒక రోజు జరిగిన సంఘటన- సర్వసామాన్య సంఘటనతో-త్రోసిరాజంది. ఆనాడు కాలేజీలోకి వెళ్ళి ఆ ఆడపిల్లల చిలిపి అల్లరులని లెక్కచెయ్యకుండా కనకంతో మాట్లాడ కలిగాడు. "మీరు జేబురుమాలు పారేసుకున్నారండీ. ఇదిగో." అని చేతికిచ్చాడు- ఆవాళ... అలా ప్రారంభమైన వారి స్నేహం త్వరలోనే అనురాగంగా మారింది.

ఈ అనురాగం అతనికి మనశ్శాంతి నివ్వలేదు సరికదా, ఎప్పుడూ విశ్రాంతికూడా తీసుకోనివ్వలేదు. ఎవరేమనుకున్నా లెక్కచెయ్యకుండా

కె. రామలక్ష్మి

ఆమెని తనదానిగా చేసుకుందాం అని నిశ్చయించుకున్నాడు...ఆమెకోసం ఎంతో మానసికవ్యథని పడ్డా పైకి ప్రశాంతంగా ఉండేవాడు. అతని ఈ ప్రశాంత వదనం, అతని మితభాషిత్వం కనకంలో అనూహ్యమైన వూహలు రేపాయేమో! లేకుంటే అంతసులభంగా ఒకనిశ్చయానికి వచ్చి వుండదు...స్త్రీ మనఃప్రవృత్తే యింతకాబోలు! మానవుడిలో అశాంతి రేపుతుంది. ఆమె తనదిగా కృష్ణమూర్తి నిర్మించుకున్న వూహాసౌధాలన్నీ అలాగే వుండిపోతాయని, అతనే నమ్మలేకపోయాడు. కనకం చూపే మొండిధైర్యం ఒక్కొక్కప్పుడు అతనిలో అనుమానంకూడా లేపింది. లేకుంటే ఏమిటి? ఆమె పెళ్లికి ప్రయత్నాలన్నీ చేస్తుంటే, తనకి ఒకసారిచేస్తే ఏం? ఏమో! ఆమెతలిదండ్రులని ఒప్పించి తనదాన్నిగా చేసుకోనేవాడేమో!...ఆనాడు ఆమెపంపిన చిన్న ఉత్తరం ..."నువ్వు చాలా ముభావంగా వుండిపోయావు. నాపెళ్ళిఅంతా సిద్ధం అయింది. ఇక నీకూ నాకూ ఏమిటి బాంధవ్యం?..సెలవు" అని చదువుతూంటే కృష్ణమూర్తికి ఆశ్చర్యం వేసింది. తనేంచేశాడని యింత అన్యాయం చేసింది? ముభావంగా ఉండిపోయింది ఎవరు? .... అంతే. ఆమె పెళ్లిచేసుకొని అత్తవారింటికి వెళ్ళిపోయిందని విన్నాడు.. పోనీలే ఆమెని సుఖించనీ. అంతేచాలు... అని తనజీవితాన్ని తిరిగి ఒక ఒరవడిలో పెట్టే ప్రయత్నంలో పడ్డాడు కృష్ణమూర్తి. కాని ఎలాగ? దేవుడు తనే సృష్టించిన మానవుడిమీద కక్షతీర్చుకుందుకో అన్నట్లు జ్ఞాపకశక్తి ఒకటిచ్చాడు. మానవుడిస్థితి ఎంత దీనం అంటే, ఏవిషయాలైతే పూర్తిగా మరచిపోదామని అనుకుంటాడో అవే అనునిత్యం స్మృతిపథంలో మెదిలి బాధపెడతాయి... కనకంతో తనజీవితంలో ఒక అధ్యాయం ముగిసిందనే అనుకున్నాడు.

...అప్పుడే సూర్యుడు ఉదయించాడు... చిరుఎండ నేలమీదపడి వింతవింత పోకడలు పోతోంది. కృష్ణమూర్తి కిటికీవూసలు పట్టుకొని అలాగే శూన్యంలోకి చూస్తున్నాడు. ధారావాహినిగా బయలుదేరిన భావోద్రేకాన్ని అరికట్టలేని నిస్సహాయునిగాఅలాగే నించుండిపోయాడు.

ఆమె తన జీవితాన్ని నాశనంచేసింది. పోనీ తను సుఖించిందా? లేదు ... ఆవేళఉదయం-చెల్లాయివచ్చి చెప్పింది-కనకం మళ్ళీ యిక్కడికి వచ్చిందిట అని. తనమనస్సుని ఎంతో దిట్టపరచుకున్నాడు-ఆ వీధికికూడా వెళ్ళకూడదని. కాని లాభం? తను వూరుకొన్నా కనకం మానేమానే తనగాయాన్నీ రేపింది. తనని రమ్మని ఆహ్వానించింది. అంతేకాదు-చిలిపిగా పూర్వప్రణయాన్ని జ్ఞప్తికితెచ్చింది. అంతే తిరిగీ తను ఆమెకోసం తహతహలాడేడు. అది తనతప్పుకాదే. చక్కని భర్త-ఆదరించే అత్తమామలు-అన్నీ వదులుకొని కనకం వచ్చేసింది....

భర్త దూరదేశానికి ఉద్యోగానికి వెళ్ళాడు. దానితో భర్తదంతా వింత తరహాగా తోచింది కనకానికి. లేకుంటే, తనని ఒంటరిగా వదలి అలా వెళ్ళడం ఏమిటి అనుకుందేమో. ..పాత స్నేహితుడు జ్ఞాపకానికి వస్తేమాత్రం.... అలా వచ్చేసి తన జీవితాన్ని తిరిగి కెలికింది. తనకి ఏం హక్కుందని అలా చేసింది?....కబురుమీద కబురు పెట్టి తన నిశ్చయాన్ని మార్చుకొనేలా చేసింది. తనలో ఆశలు రేకెత్తించింది...ఒకసారి వెళ్ళాడు. అంతే, పాతబంధాలు తిరిగి బిగుసుకున్నాయి... రోజూ వెళ్ళాడు. తొందరపడి పెళ్ళి చేసేసుకున్నందుకి ఎంతో దుఃఖిస్తున్న ఆమెని ఓదార్చాడు.... తెల్లవారిన దగ్గరనుంచీ సాయంత్రం కోసం ఎదురుచూసి ఆమెని కలుసుకొనేవాడు... లోకంతో నాకేంపని! అని సద్ది చెప్పుకొన్నాడు. అప్పుడప్పుడు భర్తరాసిన వుత్తరాలు చూపేది కనకం. కృష్ణమూర్తి బాధపడేవాడు-తన స్వార్థం కోసం యిద్దరికి మనశ్శాంతిని పోగొడుతూంది కనకం - అనుకునేవాడు. కాని ఆమె సాన్నిధ్యంలో ఏముందో-అస్తమానూదాన్నే కాంక్షించేవాడు. ఇదెవరితప్పు? కనకందే. లేకుంటే తననెందుకు ఉన్మత్తుణ్ణి చెయ్యాలి? అనుకొనేవాడు. రోజులు క్షణాల్లా గడిచాయి.

కాని, ఆత్మగౌరవం ఏమైంది? రమ్మనగానే 'రాను' అనలేకపోయాడు. వెళ్ళాడు. కాని యివాళ? "వారంరోజుల్లో వస్తారట, ఇక నువ్వు రాకు" అని ఎంత ముక్తసరిగా చెప్పిందని! పాదాలకింద భూమిలేనట్టు అనిపించింది కృష్ణ

మూర్తికి. ఇంతేనా తనమీద ప్రేమ! ఇంతేనా తనమీది మమకారం! తను సంఘంలో గౌరవాన్ని ప్రతిష్ఠనీకూడా లెక్క చెయ్యకుండా ప్రవర్తించాడే. అలాంటిది యిప్పుడు మళ్ళీ తనని ఏం చెయ్యమని యిలా తోసేసింది?...వారం రోజుల్లో కనకం భర్త రానూ వచ్చాడు. కృష్ణమూర్తి ఆమెని చూడ్డమూ మానేశాడు.

కిటికీలోంచి అలా చూస్తున్న కృష్ణమూర్తికి, ఎదుట శూన్యం తప్ప యింకేమీ కనిపించడం లేదు. అవును-తనకి శూన్యంకాక యింకేమిటి? తన కథనం ముగించుకుపోగానే సరి అనుకుంది కనకం. నా సంగతి ఆలోచిందా?

భర్త వూరికిపోగానే తిరిగి తనే వచ్చింది. ఇది అన్యాయం "నా జీవితం నాశనం చెయ్యకు. నీ కేంలోటు? నీ చుట్టూ నీ క్కావలసినవాళ్లున్నారు. నన్నిలా బతకనీ!" అని చెప్తే వింటేగా, 'నువ్వు లేకుంటే నా జీవితం వృథా. సంఘట్టనల నెదుర్కోలేనంతమాత్రాని నన్ను హింసించకు. నీ సాన్నిధ్యంలోనే నాకు తృప్తి. సంతృప్తి.' అని ఏవేవో చెప్పిందే. ఎలా కాదనడం? కష్టాల మధ్య అణగారినా మానవహృదయం ఆశఅంటూ గోచరిస్తే చిగురించేస్తుంది. కృష్ణమూర్తి పని అంతే అయింది. మళ్ళా కనకం తన జీవితాన్ని చిగురింప చేస్తుందనుకున్నాడు... రోజులూ, వారాలూ, నెలలూ గడిచాయి. కనకం భర్త వుత్తరాలూ రాస్తున్నాడు. క్లుప్తంగా సమాధానాలూ పొందుతున్నాడు. కనకం అతన్ని పూర్తిగా జయించింది. కృష్ణమూర్తి ఇక మనిద్దరం ఏమైనాగానీ విడిపోం. అనుకొన్న మాట నిజం. కాని...కాని?

వ్యథిత హృదయానికే వ్యథలు... కష్టజీవితాలకే కష్టాలు. ఇవి ఈ లోకంలో మామూలే. రమ్మన్నదీ తనే పొమ్మన్నదీ తనే. కాని ఆ చిన్న మాటలు ఎదుటిహృదయంలో ఎలాంటిదీనావస్థని సృష్టిస్తాయో ఆలోచించలేదు... ప్రశాంత సమయంలో చల్లగా కన్ను మూసింది. తత్ఫలితంగా ఆమె కథనం ముగిసింది. కాని తనది?...మనుష్య సంచారం ప్రారంభమయి ఎంతసేపయిందో...

...ఆ రోజు ఆనందంతో ఓలలాడింది తన [illegible]

వరూ విడలీయలేరు - అనుకున్నాడు పిచ్చిగా కృష్ణమూర్తి. ...తన నమ్మకాన్ని ఆవేళే చెప్పాలనుకున్నాడు. అదే వుత్సాహంలో వెళ్ళాడు...

"కృష్ణమూర్తీ, జరిగిందేదో జరిగిపోయింది. అల్లుడూ వుద్యోగం వదులుకొని వచ్చేస్తున్నాడు. నువ్వు యీపక్క యింక రావడం మంచిది కాదేమో!" అని చల్లగా కనకంతల్లి చెప్పింది. కృష్ణమూర్తి అచేతనుడయాడు. కాని క్షణంలోనే నవ్వొచ్చింది తనని తను తల్చుకొంటే...తనేం చేశాడని యిలా ఆటవస్తువుగా చేసింది కనకం? జీవమున్నంటే ఆటబొమ్మమటుకు అనుభూతులకి అతీతమా?...అనుకుంటూనే వచ్చేశాడు. అంతే. మళ్ళీ కనకాన్ని చూద్దామని కాని ఆమెతో మాట్లాడుదామనికాని అనుకోలేదు. ఇప్పుడేనా ఆమె సుఖపడి తనని తనకి వదిలేస్తే: ఒక ఆడది అన్యాయంగా ఎందుకిలా మానవుడి జీవితంతో చెలగాటం ఆడిందో అర్థం అవడం కష్టం. ఆమె స్వార్థంకోసమే ఇలాచేసింది...నెలగడిచింది... నెలలో ఎన్నివేల క్షణాలున్నాయో అన్నివేల క్షణాలూ, తనకి జరిగిన అన్యాయానికి నిజంగా తను అర్హుడనా అని ఆలోచించుకుంటూనే గడిపాడు కృష్ణమూర్తి.

..."కనకం పోయిందటరా కృష్ణా. కొడుకుని కందిట పాపం!" ఎంతో జాలిగాచెల్లాయి చెప్పేసరికి దిగ్భ్రమచెందాడు. ఎంత స్వార్థం! అనుకున్నాడు. అణచినకొద్దీ ఆలోచనలు రేగుతున్నాయి. మార్గాంతరం లేనప్పుడు మానవుడికి వచ్చే సహనమే కృష్ణమూర్తికీ వచ్చింది.

ఎప్పుడు నిద్రపోయాడో తెలివివచ్చి కిటికీలోంచి చూస్తే. నిన్నటి నాలుగ్గంటల సమయమే అయింది. మిణుకుమిణుకుమంటూ చుక్కలూ వున్నాయి. సన్నగిలుతూన్న చీకటులూ వున్నాయి. కాని కనకం పోయి ఇరవైనాలుగ్గంటలు పూర్తియాయి. ప్రపంచానికి తెలియకుండా కన్ను మూసింది కనకం.

ఇలాగే ప్రతిరోజూ, ఎన్నో జీవులు కాలగర్భంలో కన్ను మూస్తూ వుండవచ్చు. కాని ప్రతి వ్యక్తికీ కూడా ఏదో విధంగా ఏదో ఒక [illegible]

తొణికించీ, కన్ను మూసేవుంటుంది. కాని. . . ఎవరిమీద పగతీసుకోందుకు తనని యిలా చేసింది కనకం? తను కనులు మూసి చల్లగా వెళ్లిపోయిందే: దానితో సమస్యలన్నీ విడిపోతాయని తలచిందా? అసలు జీవిత కథనానికి ముగింపు ఏమిటి? ఈ లోకంలో దేనికి సమాప్తి ఉంది? వసంతంలో వేసవికోసం, చలికాలంలో వసంతాగమనంకోసం, చేజారిన మధుర క్షణాలకోసం, రాబోయే కష్టాలకోసం బాధపడుతుందే కాని, మానవ హృదయం - వసంతంలో వసంతాన్నీ చేజారకుండా మధురక్షణాలనీ అనుభవించదు. అనుభవించడంలో కంటే, వాటినిగురించి ఆలోచించడంలో ఎక్కువ ఆనందం వుంటుందేమో! కనకం అంతే చేసింది. తను ఆనందించలేదు. తనని ఆనదించనివ్వలేదు . . . కాని యిప్పుడు అంతా శూన్యంచేసి తన దారిన తను వెళ్ళిపోయింది. ప్రపంచం తనకేం లోటుచేసింది? అందరం ఆమె ఆనందంకోసం చెయ్యగలిగినదంతా చేశారు. దానిని అనుభవించే మార్గంలో ఆమె యితరులకి దుఃఖం కలిగించింది.

చీకటులని పారద్రోలి లేయండలు ఆక్రమించుకొంటున్నాయి. కృష్ణమూర్తి బరువుగా లేచాడు కిటికీదగ్గరనుంచి. సముద్ర మధ్యంలో కెరటాల తాకిడికి తట్టుకునే దీపస్తంభంలా, తనూ కనకం రేపిన అలల వలయాలమధ్య పడ్డ రాయినే ఆధారంగా చేసుకున్నాడు. రాయితో కూడా వుంటే అలల ప్రయాణ తాకిడికి నిలవవచ్చునని ఆశ. కానీ...ఏమో! మానవుడికి మనశ్శాంతి యీ లోకంలో లేదు. మానవుడు ఎంత మానవత్వం చూపుదామన్నా, అతనికి దానవతే ఎదురౌతుంది. ఎదురెండ ముఖానికి రాకుండా కిటికీరెక్కలు జేరవేశాడు కృష్ణమూర్తి.

---

కథానిక

# వెన్నంటిన నీడలు

"శ్రీధర్"

అది నేను కలకత్తాలో ఒక పెద్ద కంపెనీలో సేల్సుమేనేజరుగా పనిచేస్తూన్న రోజులు. పదిహేనువందలు జీతం, మంచి బంగళా, కారు- ఒక్కమాటలో-ఆనందోద్వేగంతో కాలం చాలా జోరుగా గడిచిపోయేది. జీవితంలో ఉండే-లేక ఉంటుందనుకునే- చీకటిభాగం ఎప్పుడూ కనిపించేదికాదు. ఏదో స్త్రీల వ్రతకథల్లో చెప్పినట్టు 'కష్టాలెలాగుంటాయి' అనడిగేట్లుండేవి ఆ రోజులు.

ఒకనాడు సాయంకాలం మామూలుగా ఆఫీసునుంచి కార్లో బంగళాకొచ్చి, శుభ్రంగా మొహం కడుక్కుని, నా రూములో సోఫాకి నడుం చేరవేసి నేను మా శ్రీమతి అందించిన కాఫీ సేవిస్తూ.

ఇంతలో మా హిందుస్థానీ నౌకరు గుమ్మంవద్ద కొచ్చి, "మహారాజ్" అన్నాడు.

"ఏం?" అన్నాను.

"ఎవరో ఒకబ్బాయి తమరికి దీన్నిమ్మన్నాడండి" అంటూ ఒక చిన్న కాగితం అందించేడు.

"ఎవరితను?" అని ప్రశ్నించేను కాగితంవైపు చూస్తూ. "నందలాల్ కిషోర్" అన్న అక్షరాలు ముద్దుగా ఇంగ్లీషులో వ్రాయబడివున్నాయి.

"తెలీదు సార్. తమదర్శనం కావాలంటున్నాడు" అన్నాడు నౌకరు.

"సరే. ఆఫీసు రూములో కూర్చోమను, ఇప్పుడే వస్తాను" అని టై నిలువుటద్దంలో సరిచూసుకుని, కోటు బుజాన తగిలించుకుని బయల్దేరబోతున్నా—

మా శ్రీమతి అప్పటికప్పుడే పూర్తిగా టాయిలెట్ అయిందేమో-

"ఏమండోయ్! త్వరగా తెమలండి. సినిమా ప్రోగ్రాం మరిచిపోయేరా?" అని హెచ్చరించింది.

"మరిచిపోలేదుగాని డ్రైవరున్నాడా? వెళ్ళిపోయాడా? ఉంటే కారు పెకిలీసి ఉంచమను."